ప్రజాశక్తి
గురువారం 1 డిసెంబర్ 2022





విద్యార్థినులకు విద్యాదీవెన మెగా చెక్కును అందిస్తున్న అధికారులు

విద్యాదీవెన సాయం రూ.24.66 కోట్లు

◆ 42,411 మందికి లబ్ధి ◆ సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా జగనన్న విద్యాదీవెన పథకం కింద రూ.24.66 కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. 4వ విడత జగనన్న విద్యా దీవెన పథకం సంబంధించి 2022 జులై-సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి అర్హులైన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదును బుధవారం జమ చేశారు. ఇందుకు సంబంధించిన జిల్లా స్థాయి కార్యక్రమాన్ని పుట్టపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న విద్యాదీవెన కింద 42,411 మంది విద్యార్థులకు సంబంధించి 38,099 మంది తల్లుల ఖాతాలకు రూ.24,66,18,443 నగదును జమ చేసినట్లు చెప్పారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి విద్యాదీవెన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం కింద ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే అర్హులైన పేద విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యాభివద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబులేసు, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఎంపిపి ఎవి.రమణారెడ్డి, పుడా ఛైర్మన్ లక్ష్మీనరసమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మల జ్యోతి, డిటిడబ్ల్యూ మోహన్ రామ్, విద్యార్థినులు పాల్గొన్నారు.



జెసి కుటుంబాన్ని... వెంటాడుతున్న కేసులు

◆ ఆర్థిక వనరులపై వేటు
◆ గతంలో గనులు రద్దు... బస్సులు జప్తు
◆ ఇప్పుడు ఆస్తుల అటాచ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర రాజకీయ ప్రముఖుల్లో ఒకరుగానున్న జెసి కుటుంబాన్ని కేసులు వెన్నాడుతూనే ఉన్నాయి. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్కొక్క కేసు మీద పడుతూ వచ్చింది. ఇప్పుడు తాజాగా కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఈ కుటుంబంపై దృష్టి సారించింది. వారికి సంబంధించిన రూ.22.10కోట్ల విలువైన స్థిర,చరాస్తులను జప్తు చేసింది. వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తే వారి ఆర్థిక మూలాలపై ఒక్కొక్కటిగా వేటుపడుతూ వస్తోంది. ప్రారంభంలో అనుమతి ప్రాంతాల్లో బస్సులు నడుపుతున్నారన్న ఆరోపణలపై వాహనాలను సీజ్ చేశారు. దీంతో రాష్ట్రంలో పేరొందిన ప్రయివేటు రవాణా సంస్థగానున్న 'దివాకర్ ట్రావెల్స్' ఇప్పుడు ఎక్కడా కనిపించకుండాపోయాయి. ఇది ముగిస్తున్న సమయంలోనే మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డికి సంబంధించిన బైరైటీస్ గనులపై దర్యాప్తు ప్రారంభమైంది. గనులను అనుమతులకు మించి జరిపారన్న ఆరోపణలపై జరిమానాలు వేయడంతోపాటు, వాటిని జప్తు చేశారు. అంతకుమునుపే ఆరోపణలున్న త్రిశూల్ సిమెంటుకు కేటాయించిన గనులను నిబంధనలకు విరుద్ధంగా తవ్వారన్న ఆరోపణలపైనా దర్యాప్తు సాగుతూనే ఉంది. ఇవి జరుగుతున్న సమయంలోనే బిఎస్-3 వాహనాలను బిఎస్-4 వాహనాలుగా నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసి తప్పుడు పత్రాలతో 153 వాహనాలను రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై మొదట రవాణా శాఖ దర్యాప్తు ప్రారంభించింది. ఆ తరువాత పోలీసు శాఖ రంగ ప్రవేశం చేసింది. దీనిపై కేసు నమోదు చేయడమే కాకుండా జైలుకు సైతం జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు జెసి.అస్మిత్‌రెడ్డి వెళ్లివచ్చారు. ఇంకా దర్యాప్తు మందకొడిగా సాగుతోందని భావిస్తుండగానే కేంద్ర విచారణ సంస్థ ఎన్‌ఫోర్సుమెంటు సంస్థ రంగంలోకి దిగింది. మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డిల ఇళ్లపై కొన్ని నెలల క్రితం తనిఖీలు నిర్వహించారు. ఆ తరువాత విచారణ సైతం చేపట్టారు. ఇప్పుడు తాజాగా వారి స్థిర,చరాస్థులను జప్తు చేయడం పెద్ద చర్చనీయాంశమే అయింది. రూ.22.10 కోట్ల విలువైన ఆస్తులను ఇప్పుడు జప్తు చేశారు. ఈ రకంగా జెసి సోదరుల ఒక్కొక్క ఆర్థిక వనరులపై వేటు పడుతూవస్తోంది.

1982లో జెసి.దివాకర్‌రెడ్డి రాజకీయ రంగప్రవేశం చేశారు. అప్పటి నుంచి ఆ కుటుంబం ఓటమి ఎరుగకుండా తాడిపత్రిలో ఏక ఛత్రాధిపత్యం చెలాయిస్తూ వచ్చింది. ఆరుసార్లు వరుసగా జెసి.దివాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రారంభం నుంచి కాంగ్రెస్ పార్టీలోనున్న జెసి కుటుంబం 2014లో రాష్ట్ర విభజన అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పుడు ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. 2019లో సీనియర్ నాయకులుగానున్న జెసి.దివాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి కాకుండా వారి తనయులు జెసి.పవన్‌కుమార్‌రెడ్డి పార్లమెంట్ సభ్యులుగానూ, తాడిపత్రి శాసనసభకు జెసి.అస్మిత్‌రెడ్డిలు తొలిసారిగా పోటీ చేశారు. కాగ ఈ ఎన్నికల్లో ఇద్దరూ ఓటమి పాలయ్యారు. ఇదే సమయంలో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి జెసి కుటుంబానికి కష్టాలు తప్పలేదు. ఒక్కొక్కటిగా ఒకదాని తరువాత ఒకటి కేసులు పడుతూ వస్తునే ఉన్నాయి. వీటి నడుమే తాడిపత్రి పురపాలక సంఘం ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా టిడిపిని గెలిపించుకుని తమ పట్టుకుని నిలుపుకున్నారు. అయితే ఆర్థిక మూలాలపై పడుతున్న దెబ్బలతో వారి రాజకీయ భవిష్యత్ రాబోయే రోజుల్లో ఎటువైపు మళ్లుతుందన్నది చూడాల్సి ఉంది.



గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాసమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

పార్టీకి పూర్వ వైభవం తెద్దాం

ప్రజాశక్తి మడకశిర

తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకురావటానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి పిలుపునిచ్చారు. నూతనంగా ఎంపికైన ఆయా మండలాల కన్వీనర్లు, కార్యదర్శులు బుధవారం స్థానికతెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గుండుమల తిప్పేస్వామిని, శ్రీనివాస్ మూర్తిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవులు అలంకరణ కాదని బాధ్యతను గుర్తెరిగి పార్టీ అభివృద్ధికి కష్టించి పని చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఎన్నికైన కన్వీనర్లు, కార్యదర్శులు, కస్టర్ ఇన్‌ఛార్జులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి- చిలమత్తూరు

మండల పరిధిలో వెంకటాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో 60 సైకిళ్లను బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాధారమణ మాట్లాడుతూ మారు మూల గ్రామాల నుండి విద్యార్థులు తమ పాఠశాలకు వస్తుంటారని, వారి సమస్యను ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ యం మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఆయన ఆర్డీటీ ఉన్నతాధికారులతో మాట్లాడి సైకిళ్లను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్పెయిన్ విద్యార్థుల బృందం పాఠశాలలో సందడి చేసింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి పురుషోత్తం రెడ్డి, సర్పంచి లక్ష్మీపతి రెడ్డి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, ఉపాధ్యాయులు దస్తగిరి, లక్ష్మీపతి రెడ్డి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పుట్టపర్తి ఎమ్మెల్యే టికెట్ వడ్డెర్లకు కేటాయించాలి

అమడగూరు : పుట్టపర్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్ వడ్డెర్లకే కేటాయించాలని వడ్డెర్లసంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం కోరారు. బుధవారం మండల కేంద్రంలోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో వడ్డెర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లెల జయరాం మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో దాదాపు 50 వేల మంది పైగా వడ్డెర్ల కుటుంబాలు ఉన్నాయన్నారు. తాను 15 సంవత్సరాలుగా పుట్టపర్తి నియోజకవర్గం లో బీసీల, వడ్డెర్ల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. తెలుగుదేశం పార్టీకి వడ్డెర్లు ఎంతో సేవ చేశారని చెప్పారు. 2014లో బీసీల తరపున ఎమ్మెల్యేగా నామినేషన్ వేస్తే తెలుగుదేశం అధిష్టానం ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చిందని అయితే ఆ హామీని నెరవేర్చలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 2019లో కూడా నామినేషన్ వేసి అధిష్టానం ఆదేశాల మేరకు ఉప సంహరించుకున్నానని చెప్పారు. 2024 ఎన్నికలలో బీసీలు వడ్డెర్లను ఒక తాటిపైకి తెచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానన్నారు. ఇప్పటికైనా దుష్ప్రచారాలు మాని వడ్డెర్ల అభివద్ధికి పాటుపడాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లికి క్రిష్ణప్ప, మాజీ ఎంపీపీ రామచంద్ర, ఉపాధ్యక్షుడు తిరుపాల్, నాగరాజు, సుధాకర్, గంగాధర్, రామచంద్ర, పెయింటర్ రాముతో పాటు వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం : కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికెళ్లి తెలియజేసి అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్ నందు టిడిపి తలపెట్టిన ఇదేం కర్మ కార్యక్రమం అమలుపై శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచకాలకు అంతులేకుండా పోయిందన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వాలెంటరీ వ్యవస్థను అడ్డం పెట్టుకొని ఎన్నికల్లో వినియోగించుకోవాలని చూస్తున్నారని వారికి తగిన బుద్ధి చెప్పే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్



ప్రతిభా విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఏడుగురు విద్యార్థుల ఎంపిక

కొత్తచెరువు : రెండు రోజులపాటు నిర్వహించిన 30వ జాతీయ సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనపర్చిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా సమన్వయకర్త వెంకటస్వామి. జిల్లా సైన్స్ అధ్యక్షులు ఆనంద భాస్కర్ తెలిపారు. రెండు రోజులపాటు కొత్తచెరువు లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ సైన్స్ కాంగ్రెస్ పోటీలకు జిల్లాలోనే 32 మండలాల నుండి 122 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులు నెల్లూరు జిల్లా గూడూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పరిగి మండలం ధనాపురం ఉన్నత పాఠశాలకు చెందిన స్వాతి, గోరంట్ల యూకే ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన ధీరజ్, పెనుగొండ సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన సింధు, కదిరి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన హర్షన్, సోమందేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చరణ్ తేజ్, ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కళ్యాణ్, ఎన్‌పి కుంట మండలం గూటి బైలు కు చెందిన హేమలత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ నరేష్, హెచ్‌ఎం చిన్నకృష్ణారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

ఆదర్శనీయుడు గురుజాడ

హిందూపురం : స్త్రీ జనోద్ధరణ కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి గురుజాడ వెంకట అప్పారావు అని ఎన్‌ఎస్‌పిఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురజాడ వెంకట అప్పారావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ ప్రగతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రచయిత్రి మాడుగుల సులోచన దేవి మాట్లాడుతూ గురజాడ అప్పారావు అసలైన సంఘసంస్కర్త అని, ఆధునిక సాహిత్యానికి అడుగుజాడ గురజాడ అని అన్నారు. కొత్త పాతల మేలు కలయికతో తెలుగువారి మత్తు వదలగొట్టిన భావ విప్లవకారుడు గురజాడ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్, యశోద రాణి, శ్రీలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

హిందూపురం : పేద, మధ్య తరగతి వర్గాల పిల్లల ప్రతిభకు పేదరికం అడ్డుకారాదని విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. జగనన్న విద్యాదీవెన అమలు కార్యక్రమాన్ని పట్టణంలోని బాలయేసు కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల ఫీజు రీఇంబర్స్‌మెంట్ కింద మంజూరైన రూ.2.92 కోట్ల మెగా చెక్కును విద్యార్థులకు ఎమ్మెల్సీ అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

35 అంశాలు.. 3 నిమిషాలు..!

◆ మున్సిపల్ సమావేశం నామమాత్రం
◆ ఛైర్‌పర్సన్ తీరుపై టిడిపి కౌన్సిలర్ల నిరసన
◆ తన వార్డుకు అన్యాయం జరిగిందంటూ వైసిపి కౌన్సిలర్ రాజీనామా



పోడియం ముందు నిరసన తెలుపుతున్న టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

మూడు నిమిషాలు... హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు కేటాయించిన సమయం ఇది. అజెండాలో 35 అంశాలను ఉంచినా వాటిపై కనీస చర్చ జరపకుండా మూడు నిమిషాల్లో సమావేశాన్ని మమ అనిపించారు. పట్టణంలో అభివృద్ధి సక్రమంగా జరగడం లేదంటూ ప్రతిపక్ష టిడిపితో పాటు అధికార వైసిపి కౌన్సిలర్లు సైతం సమావేశంలో విమర్శలు చేయడం గమనార్హం. హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ డిఎస్.ఇంద్రజ అధ్యక్షతన నిర్వహించారు. పట్టణాభివృద్ధికి సంబంధించి అధికారులు 35 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ సమావేశం జరిగే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 4వ విడత జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని పట్టణంలోని బాలయేసు కళాశాలలో చేపట్టారు. ఇందులో కౌన్సిలర్లు అందరూ పాల్గొనాలని ఛైర్‌పర్సన్ సమావేశంలో వారిని ఆహ్వానించారు. ఇందుకోసం మున్సిపల్ అజెండాలోని అంశాలతో పాటు టేబల్ అజెండాను అందరి సభ్యుల కోరిక మేరకు అమోదిస్తున్నట్లు వైసిపి కౌన్సిలర్లు లేచి నిలబడి ఆమోదం తెలిపారు. దీనిపై టిడిపి కౌన్సిలర్లతో వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. టేబుల్ అజెండాను ఇవ్వకుండానే ఎలా అమోదిస్తారని ఛైర్‌పర్సన్‌తో వాగ్వాదం చేశారు. దీంతో టేబుల్ అజెండాను తిరస్కరిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ ప్రకటించారు. ఇది జరుగుతున్న సందర్భంలోనే అధికార పార్టీకి చెందిన 5వ వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ అభివృద్ధి విషయంలో తన వార్డుకు అన్యాయం జరుగుతోందని, కౌన్సిలర్‌లకు అధికారులు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ఛైర్‌పర్సన్ పోడియం ముందు కూర్చొని నిరసన తెలిపారు. అధికార పార్టీకి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ పరుశురాం తన వార్డును ఎస్టీకి రిజర్వు చేశారని, అయితే రెండు సంవత్సరాలు కావాస్తున్నప్పటికీ ఇంత వరకు ఒక్క రూపాయి అభివృద్ధి కూడా తన వార్డులో చేపట్టలేని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో తనకు కనీస విలువ లేదని, ఈ నేపథ్యంలో తాను కౌన్సిలర్‌గా ఉండలేనంటూ రాజీనామా పత్రాన్ని ఛైర్‌పర్సన్‌కు ఇచ్చారు. మరో వైసిపి కౌన్సిలర్ శివ సైతం అజెండాలోని అంశాలపై కనీస చర్చ లేకుండా ఎలా అమోదిస్తారని నిలదీశారు. అజెండాలో తప్పుడు అంశాలు పెట్టడం వల్లే చర్చ లేకుండా ఇలా అమోదిస్తున్నారని ఆరోపించారు. మరికొందరు వైసిపి కౌన్సిలర్లు సైతం అజెండా ఆమోదంపై అభ్యంతరం తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు నిరసన తెలుపుతుండగానే ఛైర్‌పర్సన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో కొందరు కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొంతసేపటికి వారు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రజా సమస్యలపై చర్చ జరిపి పట్టణాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాల్సిన మున్సిపల్ సమావేశం ఇలా మూడు నిమిషాల్లో మమ అనిపించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



ఛైర్‌పర్సన్‌కు రాజీనామా పత్రాన్ని ఇస్తున్న వైసిపి 20వ వార్డు కౌన్సిలర్ పరుశురాం

రోడ్డు వేయకపోతే ఎలా..?

రొద్దం : ఆరు నెలలైన గ్రామంలో రోడ్డు వేయక పోతే ఎలా అంటూ మండలంలోని శేషాపురం గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యేను బుధవారం నిలదీశారు. మండలంలోని శేషాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. రొద్దం నుంచి హిందూపురం వెళ్లి దారిలో శేషాపురం క్రాస్ నుంచి గ్రామం వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల మేర తారురోడ్డు కొరకు దారిపై కంకర వేసి వదిలేశారన్నారు. 6నెలలైన రోడ్డు వేయకపోతే విద్యార్థులు పాఠశాలకు ఎలా వెళ్ళాలని ఎమ్మెల్యేను నిలదీవారు. స్పందించిన ఆయన నెల లోపు రోడ్డు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, వైసిపి మండల కన్వీనర్ తిమ్మయ్య, నాయకులు బి నారాయణ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను నిలదీస్తున్న గ్రామస్తులు



పుస్తకాన్ని ఆవిష్కరణ దృశ్యం

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పెనుకొండ

తెలుగుభాష పరిరక్షణ అందరి బాధ్యత అని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు గంగారం మోహన్ పేర్కొన్నారు. మహాకవి శ్రీ గురుజాడ అప్పారావు 107వ వర్ధంతిని పురస్కరించుకొని తెలుగు భాష పరిరక్షణ మన బాధ్యత అని అంశంపై స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలం రమేష్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు గంగారం మోహన్ మాట్లాడుతు తెలుగుభాషను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యతగా గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బషీర్ అహ్మద్, సాహితీ స్రవంతి వేదిక పెనుగొండ అధ్యక్షుడు హరి, పెనుగొండ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయప్ప, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కె. ప్రతాప్, డాక్టర్ శ్రీదేవితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

కొత్తచెరువు : విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని నారాయణ పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ గురు ప్రసాద్ తెలిపారు బుధవారం స్థానిక నారాయణ పాఠశాలలో హిందూపురం కదిరి కొత్తచెరువు పాఠశాలకు చెందిన విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని గుర్తించడానికి ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు ప్రేమ్ సాగర్, ప్రభాకర్, హరితతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

కదిరి టౌన్ : కదిరి ప్రభుత్వ ఏరియా ప్రాంతీయ వైద్యశాలలోని టీబీ యూనిట్‌లో ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి రోగులకు పోషకాహార పదార్థాలను బుధవారం అందజేశారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ హుస్సేన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం హెచ్ఒతో పాటు టీబి యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

నల్లచెరువు : మండల పరిధిలోని మద్దిమడుగు, నల్లచెరువు, ఉబిచెర్ల తదితర గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వాలెంటీర్ల పోస్టులకు ఎన్నికైన వారికి నియామక పత్రాలను బుధవారం అందజేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శకుంతల, ఎంపీపీ రమణారెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమణారెడ్డి మాట్లాడుతూ వాలెంటీర్లు నిజాయితీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని అలాగే ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

అమడగూరు : మండలంలోని పది గ్రామపంచాయతీలలో 2020- 21, 2021-2022 సంవత్సరాల్లో జరిగిన ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీకి సంబంధించిన ప్రజావేదికను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నిర్వహించారు. ఉపాధి హామీ పీడీ రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా వేదికలో ఇప్పటిదాకా చేసిన పనులను చదివి వినిపించారు. ఈ పనుల్లో కేవలం రూ. 33,520 అవినీతి జరిగిందని ప్రజా వేదికలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీలు శ్రీనివాస్ రెడ్డి, పక్కీరప్ప, జెడ్పీటీసీ కవిత శివశంకర్ రెడ్డి, ఎంపీడీవో నసిమ, ఏపీవో అమరావతి, ఎస్ఆర్పి లక్ష్మీనారాయణ, పంచాయతీరాజ్ జెఇ గుప్తా, ఈసీ ఆనంద్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

గోరంట్ల : పట్టణంలో శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇర్షాద్, ప్రైమరీ ఇన్‌ఛార్జి సుమీయ భాను, ఏవో నాగరాజు, ఉపాధ్యాయులు గంగాధర్, అనిత విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐ సుబ్బరాయుడు

వైకుంఠ రథం ఏర్పాటుకు విరాళం

గోరంట్ల : పట్టణంలో నివాసముంటున్న జవలి అంగడి లక్ష్మీనారాయణ, వేణుగోపాల్ అనే దాతలు రాయల్ వైకుంఠ రథానికి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్‌కు బుధవారం అందజేశారు వైకుంఠ రథం కొనుగోలు చేయడానికి దాతలు విరాళాలు ఇవ్వాలని గ్రామపంచాయతీ సభ్యులు కోరడంతో వీరితో పాటు మాజీ వార్డ్ మెంబర్ నాగరాజు రూ.25వేలు నగదు అందజేశారు. ఇలా పలువురు వైకుంఠ రథం ఏర్పాటు కోసం తాము సైతం అంటూ విరాళాలు అందజేస్తున్నారు

ముస్లిం మహిళలను అవమానించడం తగదు

ఓబుల దేవర చెరువు : నరసరావుపేటలో ఇటీవల జరిగిన సీఎం బహిరంగ సభలో ముస్లిం మహిళలను అధికారులు అవమానించడం తగదని టిడిపి నాయకులు అన్నారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ జాకీర్ అహ్మద్, మైనార్టీ అధ్యక్షులు చికెన్ షాను, మైనార్టీ నాయకులు షబ్బీర్ మాట్లాడారు. బురఖా వేసుకుని సమావేశానికి వెళుతున్న ముస్లిం మహిళలను అక్కడ ఉన్న అధికారులు అడ్డుకుని బురఖా తీయించి సభలోకి పంపారన్నారు. ఇలా చేయడం దారుణమన్నారు. మైనార్టీలకు అన్యాయం చేస్తే ఈ ప్రభుత్వం నిలబడదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు చాంద్‌బాషా, ఆరిఫ్ ఖాన్, నిజాం, ఇర్షాద్, మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, సునీల్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూములను పరిరక్షించండి

ఓబుల దేవర చెరువు : ఒడిసి పంచాయతీ పరిధిలోని గ్రామకంఠం భూములను అధికారులు పరిరక్షించాలని సిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్ శ్రీధర్‌కు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామకంఠం భూమిలో 50 ఎకరాల భూస్వామికి డి పట్టా మంజూరు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భూమిలేని నిరుపేదలకు ఇవ్వాల్సిన డిపట్టాను భూస్వామికి ఇవ్వటంలో అంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. వెంటనే డికెటి పట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ నాయకులు అంజి, మండల నాయకులు చలపతి, రత్న బాయ్, రాము, దేవేంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

నంబుల పూలకుంట : ఎన్నికల విధులు, జనగణన విధులనుండి ఉపాధ్యాయులను మినహాయింపు ఇస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు గంగాధర్ రెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు సిఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుపాల్ నాయక్, ఉపాధ్యాయులు ఆంజనేయులు నాయక్, సౌజన్య, రాధమ్మ, శ్రీనివాస రెడ్డి, శ్రీనివాసులు, షరీఫ్, అశోక్ కుమార్ రెడ్డి, సమీవుల్లా, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో రొద్దం విద్యార్థుల ప్రతిభ

రొద్దం : నవంబర్ 25నుంచి 29వరకు కర్నూలులో జరిగిన 35వ సబ్ జూనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో రొద్దం కేజీబీవీ విద్యార్థులు ఉష శ్రీ, సిరీష, మోనికా ప్రతిభ కనపర్చినట్లు ప్రిన్సిపల్ నాగరత్నమ్మ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి చంద్ర శేఖర్ చేతుల మీదుగా ప్రతిభ విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సాఫ్ట్ బాల్ కోచ్ లోకేష్, వైఎస్ఆర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

బత్తలపల్లి : ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని బత్తలపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. బుధవారం టిడిపి స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ డిసెంబర్ 2 నుంచి 'ఇదేం ఖర్మ' కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటామన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల వద్దకు వెళ్లి వివరించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాసులు, సురేంద్ర నాయుడు, రవి, సూరి, సుబ్బరాయుడు, చితంబర్ రెడ్డి, నెట్టెం రమణ, రంగనాయుడు, అయ్యప్ప, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ వెనుకబాటుకు కారణం పాలకులే..

పుట్టపర్తి అర్బన్ : రాయలసీమ జిల్లాల వెనుకబాటుకు పాలకులే కారణమని అన్ని విధాలా సీమవాసులు నష్టపోయారని గ్రేటర్ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎ. శ్రీనివాసులు విమర్శించారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో రైతు సదస్సు నిర్వహించారు. ఆ సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సదస్సులో శ్రీనివాసులు మాట్లాడుతూ నది జలాల పంపిణీలో అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వ్యవసాయ పంపు చెట్లకు మీటర్లు బిగించాలని చూస్తున్నాయని ఈ విధానం ద్వారా రైతులు పూర్తిగా నష్టపోతారని అన్నారు. సీమ నుంచి ఉన్నత పదవులు పొందిన పాలకులు సీమకి మొదటి నుంచి దగా చేస్తున్నారని విమర్శించారు. రైతులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మప్ప, రామాంజనేయులు, గంగప్ప, నారాయణప్ప, కృష్ణవేణి, సంధ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు భూతన్న

ప్రజాశక్తి మడకశిర

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని యుటిఎఫ్ నాయకులు విమర్శించారు. బుధవారం పట్టణంలో యుటిఎఫ్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆసంఘం జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అందవలసిన బకాయిలను విడుదల చేయాలని కోరుతూ నేడు విజయవాడలో తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా పోలీసుల ద్వారా కట్టడి చేయడం నియంత పాలనకు నిదర్శంగా నిలిస్తోందన్నారు. ఉక్కు పాదంతో ఉద్యమాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో ఉద్యమం ద్వారా సాధించుకునేందుకు విజయవాడలో ధర్నా కార్యక్రమానికి యు టిఎఫ్ పూనుకొందన్నారు. అయితే ధర్నాను భగ్నం చేయడానికి ఇతర ప్రాంతాల నుండి ఉపాధ్యాయులు తరలిపోకుండా పోలీసుల ద్వారా ముందస్తుగా అదుపులోకి తీసుకోవటం దారుణమన్నారు. అంతేకాకుండా బడిపంతులపై బైండోవర్ కేసులు పెట్టడం ముందస్తుగా ధర్నాకు వెళ్లకుండా నోటీసులు ఇవ్వడం నియంతల పాలనకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల హక్కులను కాలరాసిన గత ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఉద్యోగ ఉపాధ్యాయులకు అందాల్సిన పిఎఫ్ లోన్లు, క్లోజర్స్, ఎపిజిఎల్ఐసి లోన్లు, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవులు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ గుడిబండ మండలం అధ్యక్షుడు నరసింహప్ప, నాయకులు ఈశ్వర్, మహంతేష్, నంజప్ప, కదరన్న, మహాలింగప్ప, గిరియప్ప తదితరులు పాల్గొన్నారు.

షర్మిలపై దాడికి వ్యతిరేకంగా నిరసన

హిందూపురం : తెలంగాణా వైఎస్సార్‌పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై టీఆర్ఎస్ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య అని ప్రజాస్వామ్యవాదులు, మహిళా సంఘాల నాయకులు అన్నారు. బుధవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్లో లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును రాజ్యాంగం ప్రతి ఒక్కరికి కల్పించిందన్నారు. అయితే తెలంగాణాలో అది కాలరాస్తూ షర్మిలపై కేసులు పెట్టి, ఇబ్బందులకు గురిచేయడం శోచనీయమన్నారు. షర్మిలపై జరిగిన దాడికి వెంటనే క్షమాపణలు చెప్పి, తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య వాదులు, ప్రజా, మహిళా, మానవహక్కుల, గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు లైఫ్ వరల్డ్ ఉదయ కుమార్, చైతన్య గంగిరెడ్డి, ఎఐసిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మనోజ్ జూలియట్, కవిత, లక్ష్మీ, లలిత, భారతి, అబ్దుల్ రహీమ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లింగవివక్షను నిర్మూలిద్దాం

బత్తలపల్లి : లింగవివక్షను నిర్మూలించాలంటే అది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని మహిళలకు మండల అధికారులు సూచించారు. బుధవారం స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో లింగవివక్ష నిర్మూలనపై మండల సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని ఎపిఎం సుదర్శన్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సాయి మనోహర్, ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగవివక్ష నిర్మూలన మన ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. ఈ రోజు మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. ఇలాంటి తరుణంలో ఇంకా లింగవివక్ష అనేది కనిపించకూడదన్నారు. అంతకు ముందు తాడిపత్రి రోడ్డులోని గ్రామ సచివాలయం నుంచి మండల సమాఖ్య కార్యాలయం వరకు మండల సమాఖ్య సభ్యులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం భాస్కర్‌నాయుడు శోభారాణి, ఐసీ సీసీలు, సీసీలు, మండల సమాఖ్య ప్రతినిధులు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ స్వాధీనంపై గడువు కోరిన గ్రామస్తులు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

తిమ్మమ్మ మర్రిమాను ఆలయాన్ని ఎండోమెంట్ స్వాధీనం చేసుకునేందుకు అంగీకరించే విషయంలో తమకు కొంత గడువు కావాలని తిమ్మమ్మ మర్రిమాను సంరక్షకుల వంశీకులు, గ్రామస్తులు కోరారు. సిఐ శంకర్‌నాయక్, ఎస్ఐ సద్గురుడు, తహశీల్దార్ రవినాయక్, ఇఒ రామాంజినేయులు తదితరులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం తిమ్మమ్మ మర్రిమాను వంశీకులు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అధికారులతో మాట్లాడుతూ వెయ్యి సంవత్సరాల నుండి తమ వంశీకులు, ప్రజలు తిమ్మమ్మ మర్రిమానును రక్షించుకుంటూ పూజలు జరుపుకుంటూ ఎంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. అయితే ఈ అభివృద్ధికి కూడా ఫారెస్టు, టూరిజం శాఖ వారు కూడా సహకరించారన్నారు. అయితే ఎండోమెంట్ అధికారులు ఎలాంటి అనుమతులు నోటీసులు లేకుండా ఆలయాన్ని స్వాధీనం చేసుకోవటానికి రావటం బాధాకరంగా ఉందన్నారు. ఎండోమెంట్ అధికారులు మాట్లాడుతూ గతంలో కూడా తిమ్మమ్మ మర్రిమాను ఎండోమెంట్ ఆధీనంలో ఉందని తెలియజేయడం పాటు నోటీస్ కూడా ఇచ్చామన్నారు. ఈసందర్భంగా ఎండోమెంట్ అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. దీంతో సిఐ జోక్యం చేసుకుని పరిస్థితిని సద్దుమణిచారు. ఆలయ అభివృద్ధిలో తిమ్మమ్మ మర్రిమాను ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామస్తులకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. దీంతో తమకు కొంత గడువు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మమ్మ మర్రిమాను వంశీకులు సుబ్రహ్మణ్యం, సర్పంచి విష్ణుమూర్తి, వెంకటనారాయణ, యోగేశ్వర, శ్రీనివాసులు, రెడ్డప్ప ప్రతాప్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం తెలుసుకోకపోవటం బాధాకరం : వందల సంవత్సరాల చరిత్ర గల తిమ్మమ్మ మర్రిమానును ఎండోమెంట్ స్వాధీనం చేసుకుంటున్న విషయంపై కమిటీ సభ్యుల, ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా చర్యలు తీసుకోవటం బాధాకరమని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి డాక్టర్ నాగన్న విమర్శంచారు. ఇన్ని సంవత్సరాలు కాపాడుకుంటూ వచ్చిన తిమ్మమాంబ వారసుల అభిప్రాయం తెలుసుకోకుండా గ్రామ ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఎండోమెంట్ వారు స్వాధీనం చేసుకుంటున్నామి నోటీసును ఆలయానికి అతికించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.

జిల్లాస్థాయి జగనన్న క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

ప్రజాశక్తి కదిరి టౌన్

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో జిల్లా స్థాయి జగనన్న క్రీడా సంబరాలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. కబడ్డీ, వాలీబాల్ విభాగాలకు సంబంధించి పురుషుల, మహిళల జట్లు, క్రికెట్ పురుషుల జట్లు పాల్గొన్నాయి. దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో కబడ్డీలో పురుషుల విభాగంలో కదిరి మొదటి స్థానంలో నిలవగా పెనుగొండ రెండో స్థానంలో నిలిచింది. విభాగంలో ధర్మవరం జట్టు విన్నర్‌గా, కదిరి జట్టు రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ పురుషుల విభాగంలో పుట్టపర్తి మొదటి స్థానంలోనూ పెనుగొండ రెండో స్థానంలో నిలిచాయి. మహిళా విభాగంలో హిందూపురం మొదటి స్థానంలోనూ మడకశిర రెండో స్థానంలో నిలిచాయి క్రికెట్ పురుషుల విభాగంలో పుట్టపర్తి జట్టు ఫైనల్‌కు అర్హత సాధించగా కదిరి, ధర్మవరం జట్లు సెమీఫైనల్స్ ఆడాల్సుంది. జగనన్న క్రీడాసంబరాల ప్రారంభ కార్యక్రమంలో పుట్టపర్తి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేశవనాయుడు, ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ స్మిత, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు జగన్నాథ్‌రెడ్డితో పాటు వివిధ పాఠశాలల పీడీలు తదితరులు పాల్గొన్నారు.

దళిత నాయకుల పరస్పర విమర్శలు

ప్రజాశక్తి గుడిబండ

మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పనితీరుపై నియోజకవర్గంలోని వైసిపికి చెందిన దళిత నాయకులు గుడిబండలో బుధవారం వేరువేరుగా విలేకరుల సమావేశం నిర్వహించి ఒకరిపై ఒకరు పరస్పర విమర్శలు చేసుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వర్గీయులు అదేవిధంగా స్థానిక నాయకుల వర్గీయులు వేరువేరుగా సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే తీరు అసత్య ఆరోపణలపై ఒకరికొకరు ఘాటుగా విమర్శలు చేసుకున్నారు. స్థానిక జెడ్పీటీసీ భూతరాజు ఆధ్వర్యంలో గుడిబండలో ఓచోట విలేకరుల సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే తిప్పేస్వామి మద్దతుగా మాట్లాడారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు, ఆయన సేవల గురించి వివరించారు. ఎమ్మెల్యేపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన వారిపై ఘాటుగా విమర్శిస్తూ వారి ఆరోపణలు ఖండించారు. అదేవిధంగా స్థానిక వైసిపి నాయకులు ఎల్‌కె నరసింహప్ప, మాజీ సర్పంచి ఈరలక్క ఆధ్వర్యంలో గుడిబండలోని ఓఆశ్రమంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఎమ్మెల్యే అవినీతి ఆరోపణపై విమర్శించారు. ఎమ్మెల్యే వర్గీయులు వాటిని తీవ్రంగా ఖండిస్తూ వారిపై ప్రత్యారోపణలు చేశారు. వేర్వేరుగా నిర్వహించిన ఈ విలేకరుల సమావేశాల్లో జెడ్పీటీసీ భూతరాజు, సింగిల్ విండో అధ్యక్షులు చంద్రప్ప, మండల కన్వీనర్ రమేష్, వైస్ ఎంపీపీ రత్నమ్మ శివన్న, జమ్మలబండ సర్పంచి తిప్పేస్వామి, మోరుబాగల్ సర్పంచి తిప్పేస్వామి, మాజీ ఎంపీపీ నరసింహప్ప, మాజీ సర్పంచి ఈరలక్కప్ప, దళిత నాయకులు బసవరాజు, నరసయ్య, రాయుడు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ తీరుకు నిరసగా స్టేషన్ ముందు ధర్నా

ప్రజాశక్తి-పెనుకొండ



ధర్నాలో మాట్లాడుతున్న రమేష్

మండలంలోని తిమ్మాపురంలో దళిత భూముల విషయంలో జోక్యం చేసుకున్న ఎస్ఐ రమేష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ దళితులు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఎస్ఐకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రమేష్ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులకు చెందిన 11, 21, 12 లెటర్‌లోని 1.94 ఎకరాల భూమి విషయంలో న్యాయం చేయాలని ఎస్ఐకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఎస్ఐ తమ ఫిర్యాదు తీసుకోకుండా తమపై దౌర్జన్యం చేస్తు, అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీకి స్పందనలో ఫిర్యాదు చేస్తే స్థానిక స్టేషన్ కలవాలని సూచించారన్నారు. దీంతో మళ్లీ వచ్చి ఎస్ఐను కలిస్తే 'దిక్కున్న చోట చెప్పుకో' అంటూ దౌర్జన్యం చేయడంతో పాటు అక్రమ కేసులు పెడుతామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. తమకు న్యాయం జరగక పోతే ప్రజా సంఘాలను కలుపుకుని డిఎస్పి కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో దళితులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

తలుపుల : పేదల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఈదలకుంట్లపల్లి, మంగివాండ్లపల్లి, తండా, కొత్త పూలవాండ్లపల్లి గ్రామాలలో బుధవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి కుమారి భాయ్, ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్ రెడ్డి, నరసింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి, సర్పంచులు మాజీ సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయాశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హిందూపురం : పురపాలక సంఘంలోని 24వ వార్డులో ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు నాగేంద్రబాబుతో పాటు ఇతర కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లో పడి యువకుడు మృతి

కనగానపల్లి : మండలంలోని మామిళ్లపల్లి సమీపంలోఉన్న కొండ్రెడ్డి బావి చెక్ డ్యామ్‌లోని నీటమునిగి యువకుడు మృతిచెందాడు. మృతుడు ధర్మవరానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ సందీప్ (32)గా గుర్తించారు. ధర్మవరం పట్టణానికిచెందిన సందీప్ అనే యువకుడు తన స్నేహితుడు అంజితో కలిసి కొండ్రెడ్డి భావికిచెందిన మరొక స్నేహితుడు జయరామిరెడ్డి ఇంటికి కారులో వచ్చాడు. ఈ సందర్భంగా మద్యం తాగిన వారు కొండ్రెడ్డి బావి వద్దగల చెక్ డ్యామ్ వద్దకు ఈతకు వెళ్లారు. జయరామి రెడ్డి ఈత కొట్టి బయటకు వచ్చాడు. సందీప్ చెక్‌డ్యామ్‌లోకి దూకాడు.అయితే ఎంతసేపటికి బయటికి రాకపోవటంతో ఆందోళన చెందిన జయరామిరెడ్డి స్థానికుల సహాయంతో చెక్‌డ్యామ్‌లోకి దిగి నీటిలో మునిగిపోయిన సందీప్‌ను బయటకు తీసుకువచ్చారు. అయితే అప్పటికే సందీప్ మృతిచెందాడు. కనగానపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూర్ఛవ్యాధితో విద్యార్థి మరణం

చిలమత్తూరు : మండల పరిధిలోని చిన్నన్నపల్లి గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థి మండలకేంద్రంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో మూర్ఛవ్యాధితో మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. అందుకు సంబందించిన వివరాలు... మండల పరిధిలోని చిన్నన్నపల్లికి చెందిన శీనప్ప, సరస్వతిల కుమారుడు జగదీష్‌కుమార్ మండలకేంద్రంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలలో ఉన్న సమయంలో జగదీష్ కుమార్‌కు ఫిట్స్ వచ్చాయి. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. తల్లిదండ్రులు జగదీష్ ను చిలమత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బాగేపల్లికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే జగదీష్‌కుమార్ (15) మృతి చెందినట్లు అక్కడి డాక్టర్లు ధృవీకరించారు. జగదీష్‌కు గతంలోను అనేక సార్లు ఫిట్స్ వచ్చాయని ఆ సమయంలో గంటలోపే కోలుకునేవాడని కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో విద్యార్థి తల్లిదండ్రులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

కోళ్లఫామ్‌లో చోరీ

మడకశిర రూరల్ : మండలంలోని బుళ్ళసముద్రం గ్రామంలో గల ఎస్ఆర్ కోళ్లఫామ్‌లో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. గ్రామంలోని ఎస్ఆర్ కోళ్లఫామ్‌లోకి దొంగలు చొరబడి తాళాలు పగులకొట్టి అందులో కోళ్లకు వేసే ఆహార పదార్థాలను, కోళ్లను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై బాధితుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆటో బోల్తా..ముగ్గురికి తీవ్ర గాయాలు

హిందూపురం :హిందూపురం నుండి బేవనహళ్లి పంచాయితీ యామలపల్లికి ప్రయాణికులతో వెళుతున్న ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో బాలుని పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకి తరలించారు. యామలపల్లికి ఏడుగురు ప్రయాణికులతో వెళుతున్న ఆటో నక్కలపల్లి సమీపన మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి తాలూకా పుట్టపర్తి గ్రామానికి చెందిన సతీష్‌కు తలకు బలమైన గాయాలు అయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. పుట్టపర్తికి చెందిన అమూల్యకు కుడిచేతికి గాయలు కాగా, యామలపల్లి చెందిన దీక్షితకు ఎడమ చేతికి బలమైన గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎంజిఎం పాఠశాల అవినీతి ఆరోపణపై విచారణ

హిందూపురం : పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్ల సమయంలో పాఠశాల హెచ్ఎం అవినీతికి పాల్పడినట్లు అందిన ఫిర్యాదు మేరకు పెనుకొండ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రంగస్వామిని బుధవారం విచారణ చేపట్టారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రతి విద్యార్థిని విచారించి, విద్యార్థులు చెప్పిన విషయాలను రాత పూర్వకంగా తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు పాఠశాలలో జరిగిన అవినీతిపై విచారణకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారన్నారు. దీనిపై విద్యార్థుల నుంచి సమగ్రంగా విచారణ చేపట్టామన్నారు. మరోసారి వచ్చి హెచ్ఎం, ఉపాధ్యాయులను విచారణ చేసి, నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారి అందజేస్తున్నట్లు తెలిపారు.

ఎపి వైద్యవిధానాలపై కర్నాటక వైద్యసిబ్బంది పరిశీలన

లేపాక్షి: ఆంధ్రప్రదేశ్‌లో అనుసరిస్తున్న వైద్యవిధానాలను కర్నాటక వైద్యసిబ్బంది పరిశీలించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కర్నాటక రాష్ట్ర ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ భానుమూర్తి ఆధ్వర్యంలో వైద్యులు బుధవారం సందర్శించారు. మండల వ్యాప్తంగా అనిమియా వ్యాధి సోకకుండా తీసుకొంటున్న చర్యల గురించి ఈసందర్భంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యుడు చిరంజీవి, కర్నాటక డాక్టర్లు మాళవిక, పూర్ణిమ, సిబ్బంది హుసేన్ బీ, సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌తో పాటు ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

హిందూపురం : పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు ఈ నెల 24వ తేదీ నుండి ప్రారంభించిన ప్రత్యేక శిబిరం బుధవారంతో ముగిసింది. ఏడు రోజుల కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పలుచోట్ల చెట్లను నాటారు. చివరి రోజు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నీటి పారుదల శాఖ డిఇ యోగానంద్ మాట్లాడుతూ నీటి వనరులు వాటికి అనుగుణంగా చేయవలసిన వ్యవసాయ పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ బైసాని రాంప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. నాగేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ రాజన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి వారం రోజుల్లో విద్యుత్ సరఫరా

బత్తలపల్లి : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో గల జగనన్న లేఅవుట్‌లోకి వారం రోజుల్లో విద్యుత్ సరఫరా చేస్తామని తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సాయి మనోహర్, విద్యుత్‌శాఖ ఎఇ శివయ్య తెలిపారు. కాలనీలో విద్యుత్ లైను ఏర్పాటు చేసేందుకు బుధవారం విద్యుత్ స్తంబాలను ఏర్పాటు చేస్తుండగా కొందరు రైతులు అభ్యంతరం తెలిపారు. దీంతో ట్రాన్స్‌కో ఎఇ, తహశీల్దార్, ఎంపిడిఒ లేఅవుట్‌ను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రస్తా సమస్యపైనే అభ్యంతరం చెప్పారని అది కూడా పరిష్కారమైందని వారు చెప్పారు.

వేగవంతంగా నాడు-నేడు పనులు : డిఇఒ

చిలమత్తూరు : మన బడి నాడు-నేడు లో భాగంగా రెండవ పేజ్ లో ఎంపికైన పాఠశాలలో నాడు- నేడు పనులు త్వరతగితిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి ఆదేశించారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మన బడి నాడు నేడు కింద మంజూరు అయిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇప్పటికే సత్య సాయి జిల్లాలో చిలమత్తూరు రెండవ స్థానంలో ఉందని మొదటి స్థానం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాగరాజు నాయక్, ఎంపిడిఒ రామ్ కుమార్, పేజ్ 2 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజనీర్లు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

హిందూపురం : నాడు-నేడు పథకంతో పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్సీ ఇక్బాల్ హామీ ఇచ్చారు. బుధవారం 31వ వార్డు గాంధీనగర్‌లోని ఇసి బాయ్స్ ప్రాథమిక పాఠశాలలో రూ.16లక్షలతో చేపట్టిన పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ చిన్నమ్మ, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సురేష్, వైసీపీ నాయకులు శ్రీరాములు, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, చైర్‌పర్సన్, తదితరులు